క్లుప్తంగా

రామిశెట్టి శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ పట్టా



హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన రామిశెట్టి శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ పట్టా లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.రాధాకృష్ణ పర్యవేక్షణలో ఆగ్రో ఎకానమిక్ కండిషన్స్ ఆఫ్ ట్రైబల్ ఇన్ ద తెలంగాణ స్టేట్ స్పెషల్ రిఫరెన్స్ యానాది అండ్ ఎరుకల కమ్యూనిటీ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు కాకతీయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా లభించినట్లు చెప్పారు. దీంతో మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కొలిక్కి రాని చర్చలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడులో ఓ నర్సరీలో కొనుగోలు చేసిన మిరప మొక్కలు కాపుకు రాలేదని రైతులు ఆందోళన చేసిన విషయం విధితమే. ఆందోళన సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో రైతులకు కంపెనీ ప్రతినిధుల మధ్య దొండపాడులో చర్చలు జరిగాయి. గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా చర్చలు సుఖాంతం కాలేదు. దీంతో శుక్రవారం కోదాడలో ఇరువర్గాల మధ్య చర్చలు జరిగినప్పటికీ నష్టపరిహారం విషయంలో చర్చలు రాత్రి వరకు కూడా ఒక కొలిక్కిరాలేదు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్



నియామకపత్రం ఇస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలం పీక్లానాయక్‌తండాకు చెందిన లకావత్ విజయ్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు శుక్రవారం రాత్రి ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా రాముడునాయక్



నియామకపత్రం ఇస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బానోతు రాముడు నాయక్ పార్టీ ఎస్టీ సెల్ మఠంపల్లి మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు నల్గొండ ఎంపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాముడునాయక్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాముడు నాయక్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, సర్పంచ్ గోవింద్‌నాయక్, ఎంపీటీసీ శౌరీనాయక్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కోదాడఅర్బన్ : అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోదాడ అగ్నిమాపక కేంద్రం అధికారి కె.రామలింగం అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం జరిగితే ఏ విధంగా మంటలను అదుపులోకి తేవాలో ప్రత్యక్షంగా చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫైర్ ఇంజన్ పనిచేసే విధానం అందులో ఉండే పరికరాలు, వాటర్ ఫోర్స్‌ను పెంచి, తగ్గించే విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ ఆంజనేయులు, ఫైర్‌మన్ నగేష్, విజయ్‌కుమార్, వెంకన్న, రమేష్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజారావుకు నివాళి

కోదాడరూరల్ : మండలంలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాముల రాజారావు (63) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, ఇర్ల సీతారాంరెడ్డి, మండలపు శేషు, కన్నారెడ్డి, కోటిరెడ్డి, శెట్టి విజయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.

వ్యాపారులకు అండగా నిలబడతా



కోదాడ : ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ : కోదాడలో మునుపెన్నడూ లేనివిధంగా దోపిడీలు, దౌర్జన్యాలు పెచ్చుమీరిపోయాయని, వ్యాపారులు ప్రశాంతంగా తమ వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి నెలకొందని, వీటికి త్వరలోనే ఫుల్‌స్టాప్ పెట్టి వ్యాపారులకు ఇబ్బందులకు లేకుండా చేస్తామని నల్గొండ ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలోని వాసవీ భవన్‌లో జరిగిన కోదాడ ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గంజాయి వ్యాపారాన్ని ప్రోత్సహించి యువత జీవితాలను నాశనం చేయడమే కాకుండా కోదాడ ప్రశాంతతకు భంగం కలిగించిన వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్యవైశ్యులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఆర్యవైశ్యులు కూడా కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉత్తమ్‌కు అందించారు. అధికారంలోకి రాగానే హామీలను అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఓరుగంటి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు, వెంకటేశ్వరరావు, వంగవేటి రామారావు, గరిణె కోటేశ్వరరావు, శ్రీధర్, వెంకటనారాయణ, కంచిబండ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బడుగులకు సముచిత స్థానం

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందని హుజూర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గరిడేపల్లి మండలం కీత వారిగూడెంలో బీఆర్‌ఎస్‌కు చెందిన 50 కుటుంబాల వారు ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో గుండు వెంకన్న, బచ్చు వేణు, పిల్లుట్ల రంగయ్య, కాత్రేవుల వెంకటేశ్వర్లు, గుండు సైదయ్య, సంపంగి శీను, తవిడబోయిన పెద్దగోపయ్య, కనకయ్య, వెంకటేశ్వర్లు, కీత వెంకటేశ్వర్లు, రేఖ బక్కయ్య, నాగరాజు, అమరగాని సైదులు, గుండు సైదులు, లక్ష్మయ్య, ఎస్.నాగరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గరిడేపల్లి మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, పార్టీ జిల్లా నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, చింతకాయల సైదులుయాదవ్, చాంద్‌మియా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కీత పెద్దమట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాం

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని, వచ్చిన వెంటనే ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని లక్కవరంలో మాజీ ఎంపీటీసీ చామకూరి గురుపాదం తన అనుచరులు 300 మందితో కలిసి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, చామకూరి మధు, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, అదెర్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూరుగడ్డలో కాంగ్రెస్ ప్రచారం

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండలంలోని బూరుగడ్డలో హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, ఉపసర్పంచ్ శీలం ఆదెమ్మ, లక్ష్మి, నాగయ్య, భిక్షం, వీరబాబు, వెంకయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

నేరేడుచర్ల : ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, నాయకులు కొణతం సీతారాంరెడ్డి, నాగరాజు, మోహన్‌రావు, ప్రకాశ్, శ్రీను, పాండునాయక్, సీపీఐ నాయకులు ధనుంజయనాయుడు, లక్ష్మి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయం

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి



కోదాడరూరల్ : చిమిర్యాలలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి



కోదాడరూరల్ : చిమిర్యాలలో ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూస్తుంటే ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమైనట్లు కనిపిస్తుందని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దోరకుంట, నెమలిపురికాలనీ, చిమిర్యాల, మంగళితండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల మేనిఫెస్టోపై నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్‌ఎస్ అవినీతి పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. కోదాడను గంజాయి రహితంగా మార్చడమే ధ్యేయమన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. యువత, నిరుద్యోగులు, మేధావులు సీఎం కేసీఆర్ మాయమాటలను నమ్మకుండా వారు చేసిన అవినీతిపై గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, సర్పంచ్‌లు కొండా శైలజ, పద్మా జబ్బార్, నాయకులు కొత్తా గుర్వయ్య, వెంకటాచారి, సామినేని ప్రమీల, పూర్ణ, లాల్‌సాహెబ్, గద్దల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో ఎన్నికల ప్రచారం



వృద్ధాశ్రమంలో ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి పచ్చిపాల రామకృష్ణయాదవ్

మునగాల : కోదాడ ఇండిపెండెంట్ అభ్యర్థి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ శుక్రవారం మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఆత్మ బలిదానం చేసుకొని రాష్ట్రం సాధించుకుంటే, రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం ఇంటికో ఉద్యోగం అన్న ప్రభుత్వం మాటలు కల్లలుగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిరుద్యోగులు ఉపాధి హామీ పనికి, పత్తి పనికి, కాంటాలకు వెళ్తున్నారన్నారు. మరోపక్క విద్యార్థులకు ఫీజు బకాయిలు రాక సర్టిఫికెట్ల కోసం నానా ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. బీసీ విద్యార్థుల సంక్షేమం కోసం పోరాడే తనకు విద్యార్థి, నిరుద్యోగ యువత సహకారం అందించాలని, యాపిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

ఆర్మీ క్విజ్ పోటీల్లో విజేతగా తేజ విద్యాలయం



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో లెఫ్టినెంట్ జనరల్ సధాన

కోదాడరూరల్ : కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలైన సందర్భంగా భారతీయ సైనికదళం 'బాటిల్ ఆఫ్ మైండ్స్' పేరుతో నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో కోదాడకు చెందిన తేజ విద్యాలయ పాఠశాల విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా 12 నగరాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 32441 పాఠశాలలు పాల్గొన్నాయి. వాటిలో మొదటి, రెండవ దశ క్విజ్‌లలో 216 పాఠశాలలు ఉత్తమ ప్రతిభ కనబరచగా శుక్రవారం హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్మీ ఆర్టిలరీ కేంద్రంలో ఫైనల్ పోటీలు నిర్వహించగా కోదాడ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయ విద్యార్థులు సునందు, సృజన్, సహానా, రేఖశ్రీలు టీం 80 మార్కులు సాధించి విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు లెఫ్టినెంట్ జనరల్ సధాన బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

వడ్డెర సంఘం సమావేశం

హుజూరనగర్ : చింతలపాలెం మండలంలోని దొండపాడులో గురువారం రాత్రి వడ్డెర సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకుడు బొంత వెంకటయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నోట ఏనాడు వడ్డెర పదం వినలేదన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని దించటం కోసం హస్తం గుర్తుపై ఓటు వేసి ఉత్తమ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు వంటిపులి శ్రీనివాస్, ఆలకుంట్ల వెంకటయ్య, వల్లపు నారాయణ, జిల్లా నాయకులు తమ్మిశెట్టి బాబు, తమ్మిశెట్టి జోజప్ప, నల్లపు గురుస్వామి, గుంజ గోపి, జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు, ఆలయ కమిటీ సభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో హుజూర్‌నగర్ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. అన్నదానానికి గుంటూరు జిల్లా గ్లోబల్ మైగ్రేషన్ కన్సల్టింగ్‌కు చెందిన యాజమాన్యం కొండవీటి సాంబశివరావు, నాగలక్ష్మి కుమారులు సుబ్బారావు, లలిత, కోటేశ్వరరావు, జ్యోతిక్షలు రూ.15,116లు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రేపాల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి చల్లా రామ్మూర్తి, దంతాల నాగయ్య, కృష్ణయ్య, చంటి, నర్సయ్య, పుల్లయ్య, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రామనాథం, గురుస్వాములు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు

- హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో పార్టీ అభ్యర్థి సైదిరెడ్డి

మేళ్లచెరువు : బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని రేవూరు గ్రామంలో పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భసవయ్య, సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడుతున్నా.. ఓటు వేసి గెలిపించండి

- సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి

మేళ్లచెరువు : మండల కేంద్రంతో పాటు కందిబండ, కప్పలకుంటతండా, హేమ్లాతండా, రేవూరు గ్రామాల్లో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నానని తనను గెలిపించాలని కోరారు. ఆమె వెంట పార్టీ మండల కార్యదర్శి వట్టెపు సైదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తా

- బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలత

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా శ్రీలత అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబళ్ల నరేష్, కుందూరు కోటిరెడ్డి, ఇంటి రవి, గుండా గోపి, సాయి, సిసింద్రీ, అజయ్, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థి ప్రచారం

నేరేడుచర్ల : అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం నేరేడుచర్లలో బీఎస్పీ అభ్యర్థి రాపోలు నవీన్‌కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వ్యక్తినైన తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పెదపంగ ఉపేందర్, రామస్వామి, వెంకటేశ్వర్లు, నాగార్జున, సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోపై గీత పనివారల సంఘం హర్షం

చిలుకూరు : గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించడంపై గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు కొండా కోటయ్య హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గీత కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల భూమి కేటాయింపు, రూ.4 వేల పెన్షన్, గీత కార్మికుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గీత కార్మికులు, వారి కుటుంబాల వారు ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి గీత పనివారల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముస్లింలకు అండగా ఉంటా

హుజూర్‌నగర్ : ముస్లింలకు అండగా ఉంటానని హుజూర్‌నగర్ ఏఐఎఫ్‌బీ అభ్యర్థి పిల్లుట్ల రఘు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కులం లేదు మతం లేదు, ప్రజలంతా ఒకటే అని ప్రజలతోనే ఉంటానని అన్నారు. సింహం గుర్తుకు ఓటు వేసి గెపించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ఓజో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న తహసీల్దార్ హేమామాలిని

నడిగూడెం : ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, రెండు ఆవాస గ్రామాల్లోని 29 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ హేమామాలిని శుక్రవారం స్థానికంగా విలేకరులకు తెలిపారు. మండలవ్యాప్తంగా మొత్తం 23,989 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 11,898 మంది, మహిళలు 12,090 మంది ఓటర్లు ఉన్నట్లు ఆమె తెలిపారు.

బక్కయ్య సేవలు మరువలేనివి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఏఐటీయూసీ, సీపీఐకి కుక్కడపు బక్కయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా నాయకుడు జెట్టి ప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బక్కయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఐ నాయకులు జె.రమేష్, జి.రమేష్, ఎస్.కృష్ణ, డి.సత్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, కేఎల్‌ఎన్ రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



కోదాడరూరల్ : తమ్మరలోని పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి



మునగాల : విజయరాఘవపురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



హుజూర్‌నగర్ : పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కోదాడరూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితి వేడుకలను హిందూ, ముస్లిం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర నాగేంద్రస్వామి దేవాలయానికి కోదాడ ప్రాంతంతో పాటు ఖమ్మం జిల్లా ముదిగొండ, నేలకొండపల్లి మండల ప్రజలతో పాటు జగ్గయ్యపేట ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. తమ్మర పుట్ట వద్ద మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సామినేని ప్రమీల, సామినేని నరేష్, రాధాకృష్ణ, ఉప్పగండ్ల శ్రీనివాస్, మందలపు శేషు, తదితరులు ఉన్నారు.

మునగాల : మండల వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలను భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయరాఘవపురంలో పుట్ట వద్ద పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆకుపాముల శివారులోని నాగులమ్మ ఆలయంలో ఆకుపాముల, నర్సింహాపురం, కోదండరామాపురం గ్రామాలకు చెందిన మహిళలు పూజలు చేశారు. రేపాల శివాలయంలో పూజలు జరిపారు. అలాగే మండల కేంద్రంలోని నాగులమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్ ప్రారంభించారు.

బూరుగడ్డలోని రామలింగేశ్వర ఆలయంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీనాగేంద్ర సహిత పార్వతీరామలింగేశ్వరస్వామి పురాతన దేవాలయంలో నాగుల చవితి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహిళలు నాగులమ్మ పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ సలీమారంజాన్, మాజీ సర్పంచ్ రాధికాఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

చిలుకూరు : మండల వ్యాప్తంగా నాగుల చవితి పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కొండాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా హోమం, మహా పడిపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి పుట్ట వద్ద..

హుజూర్‌నగర్ : పట్టణంలో నాగుల చవితి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద మహిళలు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సోమప్ప దేవాలయంలో..

నేరేడుచర్ల : మండలంలో నాగుల చవితి వేడుకలను శుక్రవారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోమప్ప దేవాలయంలోని నాగుల పుట్ట, నేరేడుచర్లలోని శివాలయంలోని నాగుల పుట్టల వద్ద పూజలు చేశారు.

గరిడేపల్లి : మండలంలో నాగుల చవితి వేడుకలను ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గరిడేపల్లి వీరన్న స్వామి, ఆంజనేయ స్వామి, సాయిబాబా, కీతవారిగూడెం శివాలయం, కల్మలచెరువు వెంకటేశ్వరస్వామి దేవాలయంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో గల పుట్టల వద్ద గుడ్లు, పాలు పెట్టి పూజలు నిర్వహించారు. వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మఠంపల్లి : మండలంలో నాగుల చవితి వేడుకలను శుక్రవారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణినగర్, చౌటపల్లి, బక్కమంతులగూడెం, మఠంపల్లి, మట్టపల్లి, యాతవాకిళ్ల, పెదవీడు, రఘునాథపాలెం తదితర గ్రామాల్లో గల నాగుల పుట్టల వద్ద పాలు, పండ్లు, గుడ్లు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురంలో శుక్రవారం నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సంధ్య, ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లుట్ల శ్రీనివాస్, నాగిరెడ్డి లింగారెడ్డి, మద్రిపల్లి భిక్షం, సైదులు, కోటయ్య, భక్తులు పాల్గొన్నారు.



మునగాల : ఆకుపాములలోని నాగులమ్మ ఆలయంలో..



నడిగూడెం : కాగితరామచంద్రాపురంలో..



హుజూర్‌నగర్‌రూరల్ : రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పుట్ట వద్ద..



చిలుకూరు : కొండాపురంలో..



మఠంపల్లి : త్రివేణినగర్‌లో..



మునగాల : బరాఖత్‌గూడెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..